క్లుప్తంగా

జేసీఎస్ కన్వీనర్‌గా కత్తినేని


కత్తినేని శ్రీనివాస రెడ్డి

చీమకుర్తి: పేర్నమిట్టలోని 38 నుంచి 43 వరకు ఉన్న కార్పొరేషన్ డివిజన్‌లకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జేసీఎస్ కన్వీనర్‌గా కత్తినేని శ్రీనివాసరెడ్డిని నియమించారు. తనను నియమించిన ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుకు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, దుంపా చెంచిరెడ్డికి శ్రీనివాసరెడ్డి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

27న ప్రత్యేక విద్యుత్ అదాలత్

నాగులుప్పలపాడు: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉన్న వివిధ రకాల విద్యుత్ సమస్యలను పరిష్కరించడం కోసం ఈ నెల 27న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఉప్పుగుండూరు సబ్ స్టేషన్‌లో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఏఈ రమేష్ బాబు తెలిపారు. ఈ విద్యుత్ అదాలత్‌లో జిల్లా స్థాయి విద్యుత్ అధికారులు, సీజీఆర్ఎఫ్ చైర్మన్ తోపాటు వివిధ స్థాయి అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న వివిధ రకాల విద్యుత్ సమస్యలను ఈ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలన్నారు.

పాలస్తీనాపై మారణకాండ ఆపాలి


అమ్మనబ్రోలులో సంఘీభావం తెలుపుతున్న ప్రజాస్వామ్యవాదులు

నాగులుప్పలపాడు: ఇజ్రాయేల్-హమాస్ యుద్ధం పేరిట గాజాలోని పాలస్తీనియన్ల పై ఇజ్రాయెల్ మారణకాండను ఆపాలని ప్రజాస్వామ్యవాదులు జుజ్జూరి జయంత్ బాబు, కాట్రగడ్డ శ్రీనివాసరావు, షేక్ మహబూబ్ బాషా అన్నారు. పాలస్తీనియన్ల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని మంగళవారం అమ్మనబ్రోలు గ్రామంలోని ముస్లిం ప్రాంతంలో సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో షేక్ కరిముల్లా, సయ్యద్ అమానుల్లా, షేక్ జమీర్, సింగమనేని కృష్ణమూర్తి, అబ్దుల్ సత్తార్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఆయుధ పూజ నిర్వహించిన ఎస్ఐ

మద్దిపాడు: శరన్నవరాత్రుల్లో భాగంగా మండల కేంద్రం మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీకాంత్ మంగళవారం విజయదశమి రోజున ఆయుధ పూజలో పాల్గొన్నారు. స్టేషన్‌లో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఆలయ అర్చకుడు గంగాధర శర్మ ఆధ్వర్యంలో స్టేషన్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బందితో గస్తీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.


పూజలో పాల్గొన్న ఎస్ఐ శ్రీకాంత్‌తో సిబ్బంది


అంకమపాలెం కాళికామాత కళారం ఊరేగింపు


అంకమపాలెంలో సందడి చేస్తున్న భక్తులు

ఒంగోలు జాతర

కళారాల జాతరకు పెట్టింది పేరు ఒంగోలు నగరం. వందేళ్లకు పూర్వం నుంచే మొదలైన కళారాల జాతర.. ఏటా దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వేడుకగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం ఒంగోలులోని బాలాజీరావుపేట నుంచి కనకదుర్గమ్మ, గోపాలనగరం నుంచి లక్ష్మీనరసింహస్వామి, అంకమపాలెం నుంచి కాళికామాత కళారాలను వేలాది మంది భక్తులు శరణుఘోష నడుమ ఊరేగించారు. డీజే సాంగ్స్, తీన్మార్ డప్పుల దరువుకు యువత చిందేస్తూ సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, కళాకారుల ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. – సాక్షి, ఒంగోలు


బాలాజీరావుపేటలో కనకదుర్గమ్మ కళారం ఊరేగింపు


ఉత్సాహంగా స్టెప్పులేస్తున్న యువతులు


గోపాలనగరం లక్ష్మీనరసింహస్వామి కళారం ఊరేగింపు



గొడుగుపాలెంలో పార్వేటకు ముందుగా ఉత్సవమూర్తుల నగరోత్సవం


గొడుగుపాలెంలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు



వైభవంగా పార్వేట మహోత్సవం

ఒంగోలు మెట్రో: ఒంగోలు నగరంలోని ఆలయాల్లో విజయ దశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులకు తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. మంగళవారం సాయంత్రం కేశవస్వామిపేటలోని ప్రసన్న చెన్నకేశవ స్వామి, రమా వసుంధర సమేత సత్యనారాయణ స్వామి, గంగా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి పార్వేట ఉత్సవం వైభవంగా సాగింది. పుర వీధుల్లో దర్శనమిచ్చిన స్వామివారిని కనులారా వీక్షించి భక్తులు తరించారు. గొడుగుపాలెం, బాలాజీరావుపేటలో శమీపూజ(జమ్మి) నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, ఈఓ డి.రజనీకుమారి, అర్చకులు, ధర్మకర్తల మండలి సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, నేమాని హరిప్రియాదేవి పాల్గొన్నారు.


గాంధీరోడ్డులో అమ్మవారికి 102 రకాల ప్రసాదాలతో నివేదన


ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో వేషధారణ పోటీలో చిన్నారులు


గాంధీ రోడ్డులో పార్వేట ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

ఎస్ఆర్ హాస్పిటల్ ప్రారంభం


ఎస్ఆర్ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న బాలినేని శచీదేవి

ఒంగోలు టౌన్: అత్యంత ఆధునిక సౌకర్యాలు, నిపుణులైన స్పెషలిస్ట్ వైద్యులతో ప్రారంభిస్తున్న ఎస్ఆర్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల జిల్లా ప్రజలకు ఉత్తమ వైద్యం అందించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి శచీదేవి అభిలషించారు. సోమవారం స్థానిక 60 అడుగుల రోడ్డులో ఎస్ఆర్ సూపర్‌స్పెషాలిటీ వైద్యశాలను ఆమె ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రోజురోజుకీ అభివృద్ధి చెందుతున్న ఒంగోలు నగరంలో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన లామినర్ ఆపరేషన్ థియేటర్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తక్కువ ఫీజులతో అన్నీ వర్గాల ప్రజలకు వైద్య సేవలను అందిచాలని సూచించారు. ఆసుపత్రిలోని ఆరు విభాగాల్లో 24 గంటలపాటూ ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారని చైర్మన్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ముఖ్య అథిగా హాజరైన బాలినేని శచీదేవి, ఇతర ప్రముఖులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు, ఐఎంఏ జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సమరం, ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రత్యేకాధికారి డాక్టర్ యాదాల అశోక్ బాబు, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ జె.మణిబాబు, రెడ్ క్రాస్ అధ్యక్షుడు ప్రకాష్ బాబు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ జయశేఖర్, డాక్టర్ రామకృష్ణ, రాజు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాస్'లో కార్డియాక్ సేవలు


ఉపాస్ రెండో యూనిట్‌ను ప్రారంభిస్తున్న వైద్యులు

ఒంగోలు టౌన్: అత్యంత ఆధునిక సౌకర్యాలతో ఒంగోలు నగరంలోని సంతపేటలో ఉన్న డాక్టర్ రాజమ్మ హాస్పిటల్ ప్రాంగణంలో ఉపాస్ గుండెజబ్బుల విభాగాన్ని సోమవారం ప్రారంభించారు. ప్రస్తుతం రైల్వేస్టేషన్ రోడ్డులోని ఉపాస్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో న్యూరో, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, పల్మనాలజీ, గైనకాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో, ఆప్తమాలజీ, జనరల్ సర్జరీ సేవలు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం సంతపేటలో ప్రారంభించిన రెండో యూనిట్లో అత్యాధునిక క్యాథ్‌ల్యాబ్‌లో యాంజియోగ్రామ్ తదితర వైద్యసేవలు అందిస్తామన్నారు. పేద మద్యతరగతి ప్రజలకు అందుబాటులో వైద్యసేవలు ఉంటాయని హాస్పిటల్ డైరెక్టర్లు డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ చివుకుల శ్రీధర్, క్రిటికల్ కేర్ వైద్యులు డాక్టర్ పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దసరా ఉత్సవాలు

చీమకుర్తి: దసరా ఉత్సవాలు చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లోని ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా జరుపుకున్నారు. పలు దేవాలయాల్లో అమ్మవారిని తొమ్మిది రోజులుగా వివిధ రూపాల్లో అలంకరించి భక్తులు పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం చివరిరోజు చీమకుర్తి హరిహర క్షేత్రంలో అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతితో పాటు వారి కుటుంబ సభ్యులు, చీమకుర్తిలోని పట్టణ మహిళలు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శిద్దా రాఘవరావు అమ్మవారికి సారె, తొమ్మిది రకాల నైవేద్యాలను సమర్పించారు. జమ్మిచెట్టు వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహక సభ్యులతో పాటు అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తుల కోర్కెలు తీర్చే దుర్గమ్మ

నాగులుప్పలపాడు: భక్తుల కోర్కెలు తీర్చే అమ్మవారు మహిషాసుర మర్దిని అవతారంలో దర్శనమిచ్చారు. విజయదశమి సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో పండుగ శోభ నెలకొంది. విద్యుత్ దీపాల అలంకరణ, పచ్చ తోరణాల నడుమ భక్తుల ప్రత్యేక పూజలతో దేవాలయాలు కళకళలాడాయి. అమ్మనబ్రోలు, నాగులుప్పపాడులోని పోలేరమ్మ తల్లి దేవాలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉప్పుగుండూరు గ్రామంలోనిఆళ్వారాజుల వేణుగోపాల స్వామి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి భక్తులు నవరాత్రులను అంగరంగ వైభవంగా నిర్వహించి మంగళవారం అమ్మవారిని మేళతాళాల నడుమ గంగస్నానానికి తోడ్కొని వెళ్లారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తజన బృందం ఏర్పాటు చేసిన కోలాటం ఆకట్టుకుంది.

కొత్తపట్నం: కొత్తపట్నంలోని నాంచారమ్మతల్లి, గంగమ్మతల్లి, నాగేశ్వరస్వామి ఆలయాలతోపాటు అల్లూరు, మడనూరు, ఈతముక్కలలోని జ్వాలాముఖి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కొత్తపట్నంలో పోలేరమ్మతల్లి, గంగమ్మతల్లి గ్రామోత్సవం కనుల పండువగా సాగింది.


ఉప్పుగుండూరులో గంగస్నానానికి తరలుతున్న అమ్మవారు


కొత్తపట్నం : ప్రత్యేక అలంకరణలో నాంచారమ్మతల్లి


చీమకుర్తి హరిహరక్షేత్రం జమ్మిచెట్టు వద్ద పూజలు చేస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కుటుంబ సభ్యులు


అలరించిన భక్తుల కోలాటం

రాజరాజేశ్వరి ఆలయంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న శిద్దా రాఘవరావు దంపతులు

ఒంగోలు మెట్రో: విజయ దశమి సందర్భంగా ఒంగోలు నగరంలోని లాయరుపేట షిరిడీ సాయిబాబా మందిరంలో రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు భారీ ఎత్తున అన్నదానం చేశారు. తొలుత శిద్దా దంపతులు దంపతులు రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. షిరిడీ సాయి కల్చరల్ మిషన్ సభ్యులు శిద్దా దంపతులకు శేష వస్త్రాలు అందించి సన్మానించారు. కమిటీ సభ్యులు మల్లాది వెంకట సుబ్బలక్ష్మమ్మ, శ్రీధర్ రెడ్డి, డాక్టర్ ప్రసాదరావు, గంజాం విజయ్ శివకుమార్, మెడా జయరాజ్, వాసు సాయిరాజ్, చంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.